క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


మెహతాబ్ యాస్మిన్

సిద్దవటం : మండల ఈఓపీఆర్‌డీగా మెహతాబ్ యాస్మిన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఓపీఆర్‌డీగా పనిచేసిన పులిరామ్‌సింగ్ వీరపునాయనపల్లికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో పోరుమామిళ్ల మండలం నుంచి సిద్దవటం మండలానికి ఈఓపీఆర్‌డీగా మెహతాబ్ యాస్మిన్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పంచాయతీలలో మౌలిక వసతుల కల్పన, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు కృషి చేస్తానని అన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు


స్వీటు తినిపించుకుంటున్న బీజేపీ శ్రేణులు

రాజంపేట టౌన్ : హరియాణాలో భారతీయ జనతా పార్టీ వరుసగా మూడవ సారి విజయం సాధించడం పట్ల స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి.హరిప్రసాద్, వి.వి.రమణ, జి.కె.నాగరాజు, సూర్యచంద్ర, పత్తిపాటి నవీన్‌కుమార్, సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


నరసింహులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : జెడ్‌హెచ్‌డీసీ కాలనీ చెందిన పంట నరసింహులు మనుమడు పంట శ్యామ్ (5) రాజంపేట పాత బస్టాండ్ కూడలి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాలుడి మృతి దిగ్భ్రాంతికరమని తన విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గాప్రసాద్ వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ ప్రేమ్, ఆళ్ల నరసింహులు, డి.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి


బాల కార్మికుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

నందలూరు : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీపీఓ రామలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక వైపు ఉన్న భగత్ సింగ్ నగర్‌లో నివాసం ఉంటున్న బాల కార్మికులు గురువారం త్యాగరాజ్, గురునాథం ధను, గురునాథం పవన్‌లు చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించి వాటిని షాపులలో అమ్ముకుంటున్నట్లు సమాచారం అందడంతో వారి ఇంటివద్దకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అందుకు బాలల తల్లిదండ్రులు దసరా సెలవులు అనంతరం తమ పిల్లలను పాఠశాలలు, హాస్టళ్లలో చేర్పించడానికి ఒప్పుకున్నారన్నారు. కార్యక్రమంలో రాజంపేట సీపీయూ శైలజ, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ శంకర్ నాయక్, మహిళా పోలీస్ సోఫియా, అంగన్‌వాడీ టీచర్లు బల్కిష్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణమంటేనే భయం.. భయం

- నిత్యం ప్రమాదాలతో రక్తమోడుతున్న జాతీయ రహదారి
- సంబేపల్లె మండలంలో అంతకంతకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- అవగాహన కార్యక్రమం, నివారణ చర్యలు చేపట్టాలంటున్న మండలవాసులు


పీఎన్ కాలనీ సమీపంలో నెలకు ఒరిగిన సూచికబోర్డు


ప్రమాదంలో గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్‌ఐ, స్థానికులు (ఫైల్)

సంబేపల్లె : మండల పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె మండల పరిధిలో దాదాపు 23 కిలోమీటర్ల మేర 40 నెంబర్ జాతీయ రహదారి విస్తరించింది. మండలంలోని కొండావాండ్లపల్లె క్రాస్ సమీపం నుంచి కలకడ దగ్గర మంగళపల్లె వరకు జాతీయరహదారి ఉంది. గత కొన్ని నెలలుగా జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువయ్యాయి. తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో వాహనదారులు ప్రాణాలు కోల్పోతూ కుటుంబాలను అనాథలుగా చేస్తున్నారు. అనేక కారణాల వల్ల ప్రమాదాలు సంభవిస్తుండటంతో బాధిత కుటుంబాలు తమ కుటుంబ పెద్దదిక్కును నష్టపోతూ కుటుంబ స్థితిగతులు ఛిద్రం అవుతున్నాయి.

ప్రమాదానికి గల కారణాలు ఇవి..

మండల పరిధిలోని నారాణరెడ్డిపల్లె, మోటకట్ల, సంబేపల్లె, నల్లగంగమ్మ క్రాస్, దేవపట్ల గుట్టపల్లె, ఎస్.సోమవరం క్రాస్ మీదుగా జాతీయ రహదారి వెళుతుంది. ఈ మార్గంలో సూచిక బోర్డులు దెబ్బతినడంతో గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గం గుండా వెళ్లే సంబంధిత అధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు భద్రతా ప్రమాణాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు.

మితిమీరిన వేగం..

రహదారిపై ప్రయాణించే వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్లడం ప్రమాదాలకు ప్రధాన కారణం. ఇటీవల కాలంలో ఎక్కడ చూసిన ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబేపల్లె మండలంలోనే జనవరి నుంచే దాదాపు 23 ప్రమాదాలు చోటుచేసుకోగా ఇందులో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య అధికం. వాహనదారులు మద్యంతాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలను నడుపుతుండటంతో ప్రమాదాల బారినపడి మృత్యువాత పడుతున్నారు. జాతీయ రహదారిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు డివైడర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చని వాహనదారులు, మండల వాసులు అభిప్రాయపడుతున్నారు.

జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలు

నెల	ప్రమాదాలు	గాయాలు	మృతుల సంఖ్య
జనవరి	2	0	2
ఫిబ్రవరి	3	3	1
మార్చి	2	2	1
ఏప్రిల్	3	4	4
మే	1	0	1
జూన్	6	0	6
జులై	1	1	0
ఆగస్టు	0	0	0
సెప్టెంబర్	3	8	3

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రమాదాలపై జాతీయరహదారి అధికారులతో చర్చిస్తాం. జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న వాహనాలపై దృష్టిపెడతాం. వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. స్థానిక ప్రజలకు హైవే నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలు నివారణకు, భద్రతా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

– భక్తవత్సలం ఎస్‌ఐ, సంబేపల్లె

14న మండల సమావేశం

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 14వ తేదీ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రెడ్డయ్య తెలిపారు. ఈ సమావేశంను ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో సమస్యలపై చర్చతోపాటు వివిధ శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

ఎంపీడీఓ మల్లీశ్వరి సేవలు మరువలేనివి


ఎంపీడీఓను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

వీరబల్లి : ఎంపీడీఓ మల్లీశ్వరి సేవలు మరువలేనివని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి కొనియాడారు. బదిలీ సందర్భంగా ఆమెను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధి అధికారి మల్లీశ్వరి వీరబల్లి నుంచి బద్వేల్‌కు బదిలీ అయిన సందర్భంగా ఆమెతోపాటు సిబ్బందిని ప్రజా ప్రతినిధులు, ఎంపీపీ ఘనంగా దుశ్శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎంపీపీ మండల అభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ కార్మికుల డిమాండ్‌లు పరిష్కరించాలి


రాయచోటిలో ధర్నాచేస్తున్న కార్మికులు

రాయచోటి అర్బన్ : తమిళనాడులోని పెరంబుదూర్ సామ్‌సంగ్ కంపెనీ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నేతలు కోరారు. సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపుమేరకు పట్టణంలోని సామ్‌సంగ్ షోరూం ఎదుట కార్మికులు ధర్నాను నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ పెరంబదూర్‌లో 1500 కార్మికులు గత నెలరోజులుగా వేతనాలు పెంచాలంటూ నిరవధిక సమ్మె చేస్తున్నారన్నారు. సామ్‌సంగ్ సంస్థ దక్షిణకొరియాలో పనిచేస్తున్న కార్మికులకు 13వేల డాలర్లు చెల్లిస్తూ భారత్‌లో కార్మికులకు 3 వందల డాలర్లు చెల్లించడం దారుణమన్నారు. కార్మికులు సంఘంగా ఏర్పడే హక్కును గుర్తించాలన్నారు. ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచేవరకు సమ్మెచేస్తున్న కార్మికులకు తమ మద్దతును తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రాంబాబు, తిరుపాల్, రమణ, నాగమ్మ, రమణమ్మ, నాగరాజుతోపాటు పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రియాజ్

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని జిల్లా ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రియాజ్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం కె.రామాపురం యూపీహెచ్‌సీలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ పీసీఎస్‌ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా సమాజంలో కలసిమెలసి జీవించే విధంగా సహకరించాలని కోరారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది.. ఎలా వ్యాపించదు.. ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను ఆయన వివరించారు. ఎయిడ్స్, సుఖ వ్యాధుల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వసీం, డాక్టర్ అబ్దుల్ లతీఫ్, పీసీఎస్‌ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, ఎంపీహెచ్‌ఏ(ఎఫ్), డబ్ల్యూహెచ్‌ఎస్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీలను బలోపేతం చేయండి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత రామక్రిష్ణమాదిగ

రాయచోటి అర్బన్ : ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీలను బలోపేతం చేయాల్సిన బాధ్యత నేతలు, కార్యకర్తలపై ఎంతైనా ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామక్రిష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని భానుహరి రెసిడెన్సీలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ముఖ్యనాయకుల సమీక్షా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మందా క్రిష్ణమాదిగ నాయకత్వంలో 3 దశాబ్దాల మాదిగల పోరాటంతోనే సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పుచెప్పిందన్నారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాల ద్వారా చట్టబద్ధత చేసుకోవడం అందరి కర్తవ్యం అన్నారు. జాతి ఐక్యత, ఉజ్వల భవిష్యత్తు, పేద వర్గాల హక్కుల సాధనకు విద్యావంతులంతా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించాలంటూ కోరారు. జిల్లాలోని పాతకమిటీలను రద్దుచేసి ప్రతినాయకుడికి ఒక్క మండలం చొప్పున ఇన్‌చార్జి ఇవ్వడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా గ్రామకమిటీలు పూర్తిచేసి యుద్ధప్రాతిపదికన మండల కమిటీలు పూర్తిచేయాలంటూ కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రమాదిగ, ఎంఎస్‌పీ నేత వెలగచర్ల శివయ్య, దమ్ము చిన్న, లాయర్ రమణ, వి.శ్రీనివాసులు, నేతలు సి.వి.రమణ, సురేష్, వెంకటేష్, గండికోట వెంకటేష్, శ్రీనివాసులు, గురవయ్య, దొడ్డి వెంకటాచలపతి, ఆనంద్, చరణ్, రెడ్డికుమార్, నరసింహ, రాజశేఖర్, అన్నవరం పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన సదస్సును నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంగనపల్లె వెంకటరమణ మాట్లాడుతూ నిజాయితీ, గౌరవం, బాధ్యత, క్రమశిక్షణ, కృతజ్ఞతలు లాంటి లక్షణాలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. స్వీయ గౌరవాన్ని పెంచుతూ, విశ్వాసాన్ని పెంచుకోవాలన్నారు. విద్యార్థులు విజయవంతమైన అభివృద్ధి మార్గం కెరీర్ వృద్ధి వ్యక్తిగత నెరవేర్పు ఆత్మవిశ్వాసం వంటివి పెరుగుతాయన్నారు. ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. తల్లి, తండ్రి, గురువు దైవంతో సమానమని ప్రతి ఒక్క మనిషి దైవాన్ని వారిలో చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వై.ప్రదీప్, కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

'మా వీధికి దారి చూపండి'

రాయచోటి టౌన్ : మా వీధికి (మేము నివాసం ఉంటున్న) దారి చూపించాలంటూ యండపల్లె గ్రామం ఎగువ అబ్బవరం గ్రామ ప్రజలు తహసీల్దార్‌ను కోరారు. మంగళవారం ఈ మేరకు ఆయనకు ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎగువ కొత్తపల్లెలో సర్వే నంబర్ 681లో ఎల్లుట్ల రాజన్నతో పాటు ఐదు కుటుంబాలు వారు సుమారు 20 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నారు. దానికి దగ్గరగా శ్రీ రాముడి గుడికి స్థలాన్ని కేటాయించారు. అయితే ఇదే గ్రామానికి చెందిన జంగంరెడ్డిగారిపల్లె రాజారెడ్డి, నిమ్మనపల్లె మూలాంటి వెంకటరెడ్డిలు అడ్డంగా స్తంభాలు నాటడంతోపాటు అడ్డు చెప్పిన వారిని బెదిరిస్తున్నారని ఆరోపించారు. 60 కుటుంబాలకు కోసం ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్‌ను తొలగించే శారని అన్నారు. దీనిపై గ్రామ రెవెన్యూ, సర్వేయర్లకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.

అంతర్ పంటతో ఆదాయం చూస్తున్న రైతులు


అరటిలో అంతర్ పంటగా బంతి వేసిన రైతు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో పలువురు రైతులు అరటి, బొప్పాయి పంటలలో అంతర్ పంటగా బంతిని సాగుచేసి నిత్యం ఆదాయం పొందుతున్నారు. దసరా ఉత్సవాలలో పూలకు గిరాకీ ఉండటంతో రైతులు రోజూ బంతిపూలను మార్కెట్‌కు తరలిస్తూ కిలో రూ. 50 నుంచి రూ. 80లు వరకు అమ్ముకుంటూ ఆదాయాన్ని గడిస్తున్నారు. అరటి, బొప్పాయిల్లో నాలుగు నెలల వరకు పూలసాగు చేసుకుంటూ పెట్టుబడులు సంపాదిస్తున్నారు.

తొలగిన వానరాల బెడద


వానరాలను పట్టి తరలిస్తున్న దృశ్యం

వీరబల్లి : మండల కేంద్రంలో ఇటీవల కాలంలో వానరాలు ఎక్కువగా ఉన్నందున వీరబల్లి టౌన్‌లోని ఇండ్లలోకి వెళ్తున్నాయి. అలాగే రైతులకు ఇబ్బందిగా ఉండటంతో మంగళవారం వీరబల్లి గ్రామ సర్పంచ్ జయరాణెమ్మ దృష్టికి తీసుకువెళ్లగా వారి కుమారుడు మండల వైఎస్సార్‌సీపీ యువనాయకులు గాలివీటి వివేకానందరెడ్డి వెంటనే స్పందించి తన సొంత నిధులతో వానరాలను పట్టేవారిని పిలిపించి వాటిని పట్టుకొని సురక్షితంగా పాలకొండ అడవిలో విడిచిపెట్టారు. దీంతో వీరబల్లి ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వలంటీర్లకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి

లేకుంటే వీధి పోరాటాలు తప్పవు


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వలంటీర్లు

రాజంపేట : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం రాజంపేట మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఏపీ వలంటీర్ల అసోసియేషన్ రాజంపేట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి సర్కారు వలంటీర్లకు జగన్ ప్రభుత్వం ఇచ్చే రూ.5వేలను రూ.10వేలకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగభద్రత కల్పిస్తామన్నారు. హామీలను నెరవేర్చని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉండే వలంటీర్లతో వీధి పోరాటలకు సిద్ధమవుతామన్నారు. వలంటీర్ అసోసియేషన్ ప్రతినిధులు సాయికృష్ణ, కె.గురుస్వామిలు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో వలంటీర్లకు జీతాలు పెంచుతామని ఊరురా ప్రచారం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను గాలిలో దీపంలా పెట్టారన్నారు. గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్ల అసోసియేషన్ ప్రతినిధులు హరి, జస్వి, సురేష్, కల్పన, లక్ష్మీదేవి, సుబ్బమ్మ, పవన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సూచనల మేరకే దరఖాస్తుల స్వీకరణ

ఎక్సైజ్ అసిస్టెంటు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.రవి


దరఖాస్తుదారులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.రవి

సిద్దవటం : రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకే నూతన మద్యం పాలసీపై మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ఇందులో ఎటువంటి అపోహలు ఉండవని ఎక్సైజ్‌శాఖ అసిస్టెంటు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.రవి తెలిపారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం మద్యం దరఖాస్తుదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో నూతన మద్యం పాలసీపై 8 మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. అట్లూరు మండలంలో 1 షాపునకు, ఒంటిమిట్ట మండలంలో 2 షాపులకు, సిద్దవటం మండలంలో 5 షాపులకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. కొంత మంది సిద్దవటం మద్యం దుకాణాలపై సలహాలు అడిగారన్నారు. మంగళవారం సాయంత్రానికి దరఖాస్తులు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఈ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 23 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, మద్యం షాపుల దరఖాస్తుదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలపై హైకోర్టుకు నివేదిక


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి ప్రసూన

సుండుపల్లె : హైకోర్టు ఆదేశానుసారం వసతి గృహాలలో మౌలిక వసతులపై రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన తనిఖీ చేశారు. మండల పరిధిలోని ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆమె పరిశీలించారు. ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులకు ప్రతిరోజు తాగునీరు బయట నుంచి తెప్పించుకుంటున్నామని వార్డన్ పూజారి రెడ్డయ్య ఆమెకు తెలియజేశారు. ఎస్సీ వసతి గృహానికి ప్రధాన గేటు, గదులలో ఫ్లోరింగ్, కిటికీలకు మెష్‌లు, మరుగుదొడ్లకు తలుపులు తదితర సమస్యలను గుర్తించామన్నారు. గిరిజన గురుకుల బాలుర వసతి గృహంలో ప్రహరీగోడ లేకపోవడం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం గుట్టకింద రాచపల్లి ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. ప్రధానంగా ప్రతి వసతి గృహంలో తాగునీటి శుద్ధిచేసే యంత్రాలు లేక తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న ఆమె తెలిపారు. సమస్యలపై హైకోర్టుకు నివేదికను అందిస్తామని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విజయ్, హెడ్ కానిస్టేబుల్ బిడి నాయక్, వార్డన్‌లు పాల్గొన్నారు.

చీడపీడల నివారణలో సలహాలు పాటించండి

రైల్వేకోడూరు అర్బన్ : రైతులు తమ పొలాల్లో చీడపీడల నివారణకు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని ఏఓ సుధాకర్, శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డిలు మంగళవారం తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలోని వెంకటరెడ్డిపల్లి, కేఆర్ కండ్రిక గ్రామాలలో రైతులకు అరటి, బొప్పాయి, మామిడి పంటలలో అధిక దిగుబడిపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు వేసే ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. చీడపీడల నివారణ, అధిక దిగుబడి రావడానికి అధికారుల సలహాలు పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆధికారులు, రైతులు పాల్గొన్నారు.

జయములివ్వు.. జగన్మాత

శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. దసరాను పురస్కరించుకొని విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు వచ్చిన వారు రాత్రి వేళల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణల్లో కొలువుదీరే దేవతామూర్తులను దర్శించుకొని తరిస్తున్నారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అమ్మవారి ఆలయాల్లో దసరా శోభ కనిపిస్తుంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన మంగళవారం రాజంపేట పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి మీనాక్షీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల నేపథ్యంలో ప్రముఖ అమ్మవారి ఆలయాల వద్ద జాతర వాతావరణం కనిపిస్తోంది. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ అందిస్తున్నాయి.

– రాజంపేట టౌన్


రాజంపేట టౌన్: మీనాక్షీ దేవిగా వాసవీమాత


రాజంపేట టౌన్: విజయ లక్ష్మీదేవిగా వీరచాదేశ్వరీ


రాజంపేట టౌన్: కాత్యాయనిగా మారెమ్మ


నందలూరు: మీనాక్షీదేవిగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ


సుండుపల్లె: మహాలక్ష్మీ గా శ్రీ కన్యకాపరమేశ్వరీ


సిద్దవటం: ధనలక్ష్మీగా విజయదుర్గమ్మ


ఒంటిమిట్ట : త్రిపుర సుందరీ దేవిగా వాసవీమాత


లక్కిరెడ్డిపల్లె: అలంకారంలో సర్వమంగళాదేవి


రైల్వేకోడూరు అర్బన్: గౌరీదేవి అలంకారం


పుల్లంపేట: లక్ష్మీదేవిగా మారెమ్మ


చిన్నమండెం: శ్రీ గజలక్ష్మీ దేవిగా కన్యకాంబ


రామాపురం: గజలక్ష్మీదేవిగా దర్గామాతాజీ


రాయచోటి టౌన్ : శ్రీ గజలక్ష్మీగా భద్రకాళీ


రాయచోటి టౌన్ : గజలక్ష్మీగా శ్రీ కన్యకాపరమేశ్వరీ


రాయచోటి టౌన్: రాజరాజేశ్వరీ దేవిగా ఉమామహేశ్వరీ దేవి


రాయచోటి టౌన్:గాయత్రీ దేవిగా చౌడేశ్వరమ్మ